క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో చేపట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం మునగపాకకు చెందిన కుంది సూర్యనారాయణ–సూరిలక్ష్మి దంపతులు రూ.30వేల నగదు విరాళంగా అందజేశారు. దిమిలి పెంటారావు రూ.5వేలు, కుంది గోవింద, దిమిలి మురళి తదితరులు కమిటీ సభ్యులకు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, ఆడారి లక్ష్మణరావు,మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై నిరసన ర్యాలీ



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: కోల్‌కతా ఆర్‌జి కర్ ఆస్పత్రిలో జరిగిన హత్య, అత్యాచార ఘటనపై సమగ్ర విచారణ చేసి, నిందుతులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ డిమాండ్ చేశారు. అడ్డురోడ్డు కూడలిలో సీఐటీయూ, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో సోమవారం భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ సభ్యులు మమతా బేగం, శ్రావణి ,రాజేశ్వరి,కేశవ, శ్రీను, కృపానంద్, సీహెచ్ లక్ష్మణ్, సీహెచ్ రాము పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధన ప్రారంభించిన నాయకులు

పాయకరావుపేట: పట్టణంలో బృందావనం దుర్గాలమ్మ చెట్టు వద్ద గల షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద సోమవారం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయం 27వ వార్షికోత్సవం సందర్భంగా అన్నసమారాధన జరిపారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పాండురంగ దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ళ వరహాలు, తుని, పాయకరావుపేట తాపీమేస్త్రీల సంఘాల అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అంబటి రాంబాబు, బాలేపల్లి చినబాబు, యల్లపు నూకరాజు, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, యాళ్ళ సన్నబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

26న అప్రెంటిస్‌షిప్ కోసం ఇంటర్వ్యూలు

అచ్యుతాపురం: ఏషియన్ పెయింట్స్‌లో అప్రెంటిస్‌షిప్ కోసం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఐటీలో ఫిట్టర్,ఎలక్ట్రికల్,మెకానికల్,డిప్లమోలో మెకానికల్, ఎలక్ట్రికల్,కెమికల్ కోర్సులను 2022–24లో పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని యాజమాన్యం తెలిపింది. పూర్తి వివరాలకు 9959590601 అనే ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. గుడివాడ,గుర్రాజుపేట, బంగారమ్మపాలెం పరిశ్రమలకు, చినఉప్పలం ఆక్వా చెరువులకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయన్నుట్టు పేర్కొన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- 18 నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు
- వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న విగ్రహాలు
- ఉత్సవ నిర్వాహకుల నుంచి పెరుగుతున్న ఆర్డర్లు



విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న తయారీదారుడు



యలమంచిలి కుమ్మరి వీధిలో విక్రయానికి సిద్ధంగా గణనాథులు

యలమంచిలి రూరల్: వినాయక ఉత్సవాలు సమయం దగ్గర పడుతుండడంతో గణనాథుడి విగ్రహాల తయారీలో వేగం పెరిగింది. ఉమ్మడి జిల్లాలో వినాయక విగ్రహాల తయారీకి ప్రసిద్ధి చెందిన యలమంచిలి పట్టణంలో పలుచోట్ల విగ్రహాల తయారీ జోరుగా జరుగుతోంది. గత ఏడాదితో పోల్చితే ఈ సారి నవరాత్రులు ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఇప్పటికే మంటపాల ఏర్పాటులో ఉత్సవ కమిటీలు బిజీ బిజీగా ఉన్నాయి. మరోవైపు గణనాథుల విగ్రహాల ఆర్డర్లు, అమ్మకాలు జోరందుకుంటున్నాయి. యలమంచిలి పట్టణంలో పది చోట్ల రెండు నెలల ముందు నుంచే కళాకారులు విగ్రహాల తయారీ ప్రారంభించారు.వచ్చే నెల 7న వినాయకచవితి కావడంతో విగ్రహాలకు తుది మెరుగులు దిద్ది,రంగులు అద్దే పనుల్లో కళాకారులు తలమునకలై ఉన్నారు. పట్టణంలో కాకివాని వీధి,కుమ్మరివీధి,కోమటిపేట, పాలిమేరమ్మతల్లి గుడి,పెంజెరువు ఎదురుగా ఏకదంతుడి విగ్రహాలు తయారు చేస్తున్నారు. ప్రత్యేక స్థావరాలు ఏర్పాటు చేసుకుని విగ్రహాల తయారీ చేపడుతున్నారు.చవితి వేడుకలకు 17 రోజులే సమయం ఉండడంతో విగ్రహాల తయారీదారులు ప్రతిమలకు తుది మెరుగులు దిద్దే పనిలో నిమగ్నమై ఉన్నారు.వారికి ముందుగా వచ్చిన ఆర్డర్లతో పాటు చవితి పర్వదినానికి ముందు రెండురోజుల్లో వచ్చే కొనుగోలుదారుల కోసం అవసరమైన సంఖ్యలో విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. అడుగు నుంచి 15 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను ఇక్కడ తయారుచేస్తున్నారు. వీటి ధర రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంది. యలమంచిలి పట్టణానికి సమీపంలో పాత జాతీయ రహదారి పక్కన స్థానిక తయారీదారులతోపాటు ఇతర జిల్లాల నుంచి ఈ సీజన్‌లో ఇక్కడకు వచ్చి కొందరు తయారీదారులు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ నుంచి రాష్ట్రంలోని వివిధ పట్టణాలకు ముఖ్యంగా రాజమండ్రి, సామర్లకోట, పెద్దాపురం, గోకవరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు విగ్రహాలను ఎగుమతి చేస్తున్నారు. గతంలో ప్రధాన సెంటర్లలో గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసేవారు.నేడు యువత ఉత్సవాలపై ఎక్కువ ఉత్సాహం చూపిస్తుండడంతో ప్రతి గ్రామంలో,ముఖ్య కూడళ్లలో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు.యలమంచిలిలో ఏటా అన్ని తయారీ కేంద్రాల వద్ద కలిపి సుమారు 1,000 వరకూ విగ్రహాలను విక్రయిస్తుంటారు. వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న విఘ్నాధిపతి విగ్రహాలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి.

మట్టి విగ్రహాలపై ఆసక్తి

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు వినియోగించడం వల్ల వాతావరణం కలుషితం అవుతోంది.దీంతో కొన్నేళ్లుగా మట్టి వినాయక విగ్రహాల వినియోగం క్రమంగా పెరుగుతోంది.అధికార యంత్రాంగం,ఎన్జీవో సంస్థలు, సాక్షి మీడియా సంస్థలు సైతం మట్టి విగ్రహాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు అవగాహ కల్పిస్తున్నాయి.సాక్షి పత్రిక ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థలు,ఆలయాల వద్ద మట్టి విగ్రహాల తయారీపై విద్యార్థులకు ఉచిత శిక్షణ ద్వారా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు.పలువురు రాజకీయపార్టీల నాయకులు కూడా మట్టి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పెద్ద సంఖ్యలో పంపిణీ చేసి వాటి ప్రాధాన్యతను చాటుతున్నారు.



వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న వినాయక విగ్రహాలు

ఇప్పుడిప్పుడే ఆర్డర్లు పెరుగుతున్నాయి



ఇప్పుడిప్పుడే విగ్రహాల ఆర్డర్లు ఊపందుకుంటున్నా యి. ముడిసరుకు, రంగులు,కూలీ ధరలు గతం కంటే విపరీతంగా పెరిగిపోయాయి.కానీ విగ్రహాల ధరలు మాత్రం ఆ స్థాయిలో పెరగలేదు. అయినప్పటికీ ఈ పని తప్ప వేరే పని మాకు రాదు.అందుకే కష్టమైనా బొమ్మల తయారీ కొనసాగిస్తున్నాం. జిల్లాలో తయారీదారులు భారీగా పెరిగిపోయారు.గత ఏడాది నష్టాలు చవిచూశాం.ఈ సారి లాభాలు రాకపోతే ఈ పనిని కొనసాగించలేం.

– మునగపాక చిన బాబూరావు, తయారీదారుడు, కుమ్మరి వీధి,యలమంచిలి

15 ఏళ్ల అనుభవం



విగ్రహాల తయారీలో 15 ఏళ్ల అనుభవం ఉంది.ఏటా ఈ ప్రాంతంలో విగ్రహాలుతయారీ చేస్తుంటాం. మా వద్ద కూలీలు కూడా పనిచేస్తున్నారు.బొమ్మల తయారీ ద్వారా మాతో పాటు మరికొంత మందికి ఉపాధి లభిస్తోంది.ఈ ఏడాది ఇప్పటివరకు 50కుపైగా విగ్రహాలు తయారు చేశాం.ఆర్డర్లు ఆ స్థాయిలో రావడం లేదు.70 ఏళ్లుగా మా పూర్వీకులు యలమంచిలిలో విగ్రహాలు తయారీ వృత్తిగా చేసుకున్నారు.క్రమంగా అన్ని చోట్ల విగ్రహాల తయారీ జరుగుతోంది.దీంతో మేం తయారు చేసే బొమ్మలకు డిమాండ్ క్రమంగా తగ్గుతోంది.

– ఎం.సన్యాసిరావు, బొమ్మల తయారీదారుడు,కాకివానివీధి,యలమంచిలి

శాస్త్రవిరుద్ధ రూపాలు వద్దు



మట్టితో చేసిన గణపతిని పూజించడం అన్ని విధాలుగా శ్రేయస్కరం. ప్రస్తుత కాలంలో పోటీ పడి వినాయక మంటపాలు ఏర్పాటు చేస్తూ వివిధ ఆకృతుల్లో గణనాథుడి ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నారు.అయితే శాస్త్ర విరుద్ధమైన గణానాథుడి ప్రతిమలను పూజించడం మంచిదికాదు.పురోహితుని సలహాలతో నవరాత్రి ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడం అందరికీ మేలు చేస్తుంది.

– అనివెళ్ల శ్రీనివాస శర్మ, వేద పండితుడు, కొక్కిరాపల్లి

ఆనందోత్సాహాలతో రక్షాబంధన్



మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులుకు రాఖీ కడుతున్న సర్పంచ్ భార్య మంగ



నక్కపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వీసం రామకృష్ణకు రాఖీ కడుతున్న జెడ్పీటీసీ కాసులమ్మ



మునగపాక సర్పంచ్ అప్పారావుకు రాఖీ కడుతున్న ఓం శాంతి అక్కయ్య



తమ్ముళ్లకు రాఖీ కట్టిన సోదరి

నక్కపల్లి/మునగపాక/అచ్యుతాపురం/పాయరావుపేట/కోటవురట్ల/ఎస్.రాయవరం : రక్షాబంధన్ వేడుకలు యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. సోదరీమణులంతా తమ సోదరులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. నక్కపల్లిలో కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకష్ణకు జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వెదుళ్లపాలెం సర్పంచ్ వెదుళ్ల వరలక్ష్మి తదితరులు రాఖీ కట్టారు. ఈసందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. మునగపాకలో బ్రహ్మకుమారీస్‌కు చెందిన శ్యామల అక్కయ్య పలువురు రాజకీయ నాయకులకు, అధికారులకు రాఖీలు కట్టారు.మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు అందజేశారు. అచ్యుతాపురం,పాయకరావుపేట, కోటవురట్ల మండలాల్లో రక్షాబంధన్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలతో గ్రామాలన్నీ కళకళలాడుతూ కనిపించాయి. ఎస్.రాయవరం మండలంలో రాఖీపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద గుడివాడ సర్పంచ్ భార్య దూళి మంగ మాజీ ఎమ్మెల్యే కంబాలజోగులకు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.

భారత్ బంద్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

పాయకరావుపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21న నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ నాయకులు పెదపాటి మేఘరంజన్, నెలపర్తి అర్జున్ కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. బంద్ విజయవంతానికి అందరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు ఇంజరపు సూరిబాబు, ఐ.ఎస్. మూర్తి, పల్లా ప్రసాద్, ముక్కుడుపల్లి దాసు, నెలపర్తి నాగరాజు, గారా చంటి, పి.భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాంబరేశ్వరుని కల్యాణం



కామాక్షి ఏకాంబరేశ్వరుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కామాక్షి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం కామాక్షి ఏకాంబరేశ్వరుల కల్యాణాన్ని వ్యాపారవేత్త పెదపాటి రమణారావు–మణి, వెంకటపార్వతీశం–సత్యసావిత్రి,గిరీష్‌కుమార్–విజయ్‌కుమారి దంపతులు నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారావు మాట్లాడుతూ ఏటా పౌర్ణమి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహిండం ఆనవాయితీగా వస్తోందన్నారు.

ఘనంగా స్నాతకోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి పెద్ద బాలవనం (యూకేజీ) విద్యార్థుల స్నాతకోత్సవాన్ని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థల్లో బోధన ఆటపాటలతో జరుగుతుందని, ఈ విధానం వల్ల విద్యార్థుల్లో శారీరక, మానసిక పెరుగుదల, ఆలోచన శక్తి, పరిశీలనా శక్తి, సామాజిక స్పృహ అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గేయాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

అవార్డు గ్రహీతకు సత్కారం



అవార్డు గ్రహీత గోపిని సత్కరిస్తున్న సచివాలయ సిబ్బంది

ఎస్.రాయవరం: ఉత్తమ ఉద్యోగిగా పంద్రాగస్టు నాడు అవార్డు పొందిన తిమ్మాపురం (సచివాలయం–2) వీఆర్వో గోపీని సోమవారం సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వీఆర్వోల సంఘ అధ్యక్షుడు నూకరాజు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగాలమ్మతల్లి విగ్రహప్రతిష్ట



మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడును సత్కరిస్తున్న గ్రామస్తులు



ఎమ్మెల్యే విజయకుమార్‌ను సత్కరిస్తున్న గంగాలమ్మతల్లి గుడి కమిటీ సభ్యులు

మునగపాక: మండలంలోని మూలపేటలో నూతనంగా నిర్మించిన గంగాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. గంగాలమ్మ తల్లిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్,అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ,టీడీపీ నాయకులు దాడి రత్నాకర్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు దంపతులను, ఎమ్మెల్యే విజయకుమార్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనొద్దు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా వేసిన లేఅవుట్లలో ప్లాట్లు,స్థలాలు కొనుగోలు చేయవద్దని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ డి.ప్రభాకరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో ఎన్‌టీఆర్ కాలనీలో సర్వే నంబరు 66/8 లో 1.14 ఎకరాలు,యర్రవరం సర్వే నంబరు 26 లో 0.72 ఎకరాలు,సోమలింగపాలెం సర్వే నంబరు 136–1,136–3లో 1.10 ఎకరాలు,కట్టుపాలెం సర్వే నంబరు 186–3ఎ–1సి,186–1ఎ–1ల్లో 1.20 ఎకరాలు,పెదగొల్లలపాలెం సర్వే నంబరు 304లో 0.76 ఎకరాల విస్తీర్ణంలో అనధికారికంగా లేఅవుట్లు వేసినట్టు గుర్తించామని ఆయన తెలిపారు. ఈ అనధికార లేఅవుట్లలో ఎవరూ స్థలాలు గానీ,ప్లాట్లు గానీ కొనుగోలు చేయవద్దని సూచించారు. ఈ లేఅవుట్లలో ప్లాట్ల అమ్మకాలు,కొనుగోళ్లు జరగకుండా రిజిస్ట్రేషన్ల శాఖకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. అనధికార ప్లాట్లలో భవన నిర్మాణానికి మున్సిపాలిటీ నుంచి అనుమతులు ఇవ్వరన్నారు.భవిష్యత్తులో ఈ లేఅవుట్లలో రోడ్లు,కాల్వలు,వీధిలైట్లు,తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించడం జరగదని స్పష్టం చేశారు.అనధికార లేఅవుట్లు వేసిన యజమానులు,డెవలపర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులో గల కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగాఉత్సవ విగ్రహాన్ని సోమవారం పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామాచార్యుల ఆధ్వర్యంలో నగర సంకీర్తన, గోపూజ ప్రదక్షిణలు, త్రిమాత(లక్ష్మి, సరస్వతి, కాళి)ల మూల మంత్ర హోమం, అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, నవకలశ స్నపనం, నీరాజన మంత్ర పుష్పములు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హయగ్రీవజయంతి సందర్భంగా ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు.